కడప సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా వెంకటేశ్వరరావు

కడప సెవెన్‌రోడ్స్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కడప సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె.ఎస్.ఎస్.వెంకటేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఈయనను కడప ఆస్పత్రికి బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు.

నేడు సభాభవన్‌లో ప్రజాఫిర్యాదుల స్వీకరణ

కడప కలెక్టరేట్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఉదయం 9-30 నుంచి 10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం జరుగుతుందని, ఫిర్యాదులు చేయదలచిన వారు 08562-244437 నెంబరుకు తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా 1100 సేవలను అర్జీదారులు వినియోగించుకోవాలని, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవచ్చని తెలిపారు.

రేపటి నుంచి వన్డే క్రికెట్ మ్యాచ్

కడప స్పోర్ట్స్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కడపలోని వివిధ స్టేడియంలలో ఈ నెల 10వ తేది మంగళవారం నుంచి 16వ తేది వరకు ఏసీఏ (సౌత్‌జోన్) అండర్-19 మెన్స్ వన్డే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 10న రాజారెడ్డి స్టేడియంలో కర్నూలు - నెల్లూరు జట్లు తలపడనున్నాయి. కాగా అదేరోజు కేఎస్ఆర్ఎం మైదానంలో కడప -చిత్తూరు జట్లు, 11న రాజారెడ్డి స్టేడియంలో కడప-కర్నూలు, అదేరోజు కేఎస్ఆర్ఎంలో అనంతపురం - నెల్లూరు జట్లు, 12న విశ్రాంతి దినం, 13న అనంతపురం - చిత్తూరు, అదేరోజు కడప - నెల్లూరు, 14న చిత్తూరు - నెల్లూరు, అదేరోజు అనంతపురం - కర్నూలు, 15న విశ్రాంతి దినం, 16న అనంతపురం - కడప అదే రోజు చిత్తూరు - కర్నూలు జట్ల మధ్య వన్డే మ్యాచ్‌లు జరగనున్నాయన్నారు.

గుండెపోటుతో ఫారెస్టు బీట్ ఆఫీసరు మృతి



రామాంజనేయులు (ఫైల్)

పోరుమామిళ్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు రావడంతో వెంకటాపురంలో బీట్ ఆఫీసరుగా విధులు నిర్వహిస్తున్న రామాంజనేయులు (50) అనే అటవీశాఖ ఉద్యోగి మృతి చెందాడు. ఆదివారం బద్వేలులో జరిగే ఓ వివాహ కార్యక్రమానికి పోరుమామిళ్ల నుంచి తన ద్విచక్ర వాహనంలో వెళుతుండగా నక్కలగండి సమీపంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఇంటికి వెళ్దామని వాహనం మళ్లించే ప్రయత్నం చేసే లోపే గుండెపోటుకు గురికావడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానికులు మృతుడి కుటుంబ సభ్యులకు, ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటిన కుటుంబసభ్యులు, సన్నిహితులు సంఘటనా స్థలానికి చేరుకుని లబోదిబోమన్నారు. అనంతరం మృతదేహాన్ని పోరుమామిళ్లలోని శ్రీరామ్‌నగర్ కాలనీకి తీసుకువచ్చారు. అందరిలో మంచిగా మాట్లాడుతూ సరదాగా ఉన్న వ్యక్తి ఒక్కసారిగా మృతి చెందడంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా మృతుడికి ఇద్దరు కుమారులు ఉండగా, చిన్నకుమారుడు ఉద్యోగ రీత్యా లండన్‌లో ఉన్నాడు. ఆయన సోమవారం జరిగే అంత్యక్రియలకు హాజరుకానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఏపీ ఈఏపీ సెట్-2025 ఫలితాలు విడుదల

- ఇంజనీరింగ్‌లో 68 శాతం, అగ్రికల్చర్‌లో 88 శాతం మంది ఉత్తీర్ణత


కడపఎడ్యుకేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీ సెట్-2025 ఫలితాలు విడుదలయ్యాయి. ఇంజనీరింగ్‌లో 68 శాతం, అగ్రికల్చర్‌లో 88 శాతం మంది అర్హత సాధించారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఏపీ ఇంజనీరింగ్ వ్యవసాయ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025 ఫలితాలను ప్రకటించింది. ఇందులో భాగంగా ఇంజనీరింగ్‌కు సంబంధించి జిల్లాలో 13084 మంది దరఖాస్తు చేసుకోగా 12554 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 8545 మంది (68శాతం) అర్హత సాధించగా, వారిలో బాలురు 4931, బాలికలు 3614 మంది ఉన్నారు. అలాగే అగ్రికల్చర్‌కు సంబంధించి జిల్లాలో 3424 మంది దరఖాస్తు చేసుకోగా, 3186 మంది హాజరయ్యారు. 2835 మంది (88 శాతం) విద్యార్థులు అర్హత సాధించగా.. వీరిలో 804 మంది బాలురు, 2031 మంది బాలికలు ఉన్నారు.

వితంతు పింఛన్లకు భరోసా



- 2775 మంది అర్హుల గుర్తింపు
- వచ్చే వారంలో పంపిణీకి ఏర్పాట్లు





కడప ఎన్టీఆర్‌సర్కిల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సామాజిక భద్రత కోసం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛను పథకంలోని వితంతు పింఛన్లకు భరోసా కల్పిస్తుంది. ప్రతి నెలా 1వ తేదీన ఇంటింటికీ పింఛన్ పంపిణీతో పాటు లబ్ధిదారులు ఎక్కడుంటే అక్కడ పొందే ఏర్పాట్లు చేస్తున్నారు. పింఛను పొందుతున్న భర్త మృతి చెందడంతో మరుసటి నెలలోనే మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. గతేడాది చివరిలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో 2,54,906 మంది పింఛనుదారులు ఉన్నారు. జూన్‌లో కొత్తగా మరో 2775 మంది వితంతువులకు స్పౌజ్ పింఛన్లు మంజూరు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో భర్త మృతి చెంది ఏ ఆధారం లేని భార్యలకు స్పౌజ్ విభాగంలో త్వరలో పింఛను పంపిణీ చేయనున్నారు. ఈ నెల రెండోవారంలో పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు లబ్ధిదారుల జాబితాలను తయారు చేసి జిల్లాలోని మున్సిపాలిటీల మండల అభివృద్ధి కార్యాలయాలకు పంపినట్లు తెలుస్తుంది.

ఎదురు చూపునకు ఫుల్‌స్టాప్

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నవంబరు నుంచి పింఛనుదారుడు చనిపోతే వారి భాగస్వామికి ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లాలో ఇలాంటి వారు చాలా మంది ఉన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఇటీవల పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు చర్యలు తీసుకుంటుందని అధికారులు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వేలాది మంది అనర్హులు లబ్ధి పొందినట్లు ఇటీవల జరిగిన విచారణలో వెలుగు చూసింది. చిన్నపాటి సాంకేతిక తప్పిదాలతో చాలా మందికి పింఛన్లు నిలిపివేశారు. బద్వేలు మండలం కమ్మవారిపల్లెకు చెందిన బోయపాటి రామలక్షుమ్మ అనే మహిళ ఆమె భర్త చనిపోవడంతో 2009 నుంచి వితంతు పింఛను పొందుతుంది. అయితే 2021లో తన ఆధార్ నెంబరు వైజాగ్‌కు చెందిన మరొక రేషన్‌కార్డుకు లింకు అయింది. అప్పటి నుంచి ఆమెకు వస్తున్న పింఛను నిలిపివేశారు. రేషన్‌కార్డు కూడా రద్దయింది. దీంతో పలు దఫాలుగా ఉన్నతాధికారులను కలిసి ఎక్కడో జరిగిన సాంకేతిక కారణాల లోపంతో తనకు అన్యాయం చేస్తున్నారని అధికారులకు విన్నవించినా పరిష్కారం కాలేదు. ఇలాంటి వారు అనేక మంది జిల్లాలో ఇప్పటికీ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఏదేమైనా కూటమి ప్రభుత్వం వచ్చాక పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న వారికి మంచి రోజులు వచ్చాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా లబ్ధిదారులు

జిల్లాలోని మున్సిపాలిటీ, మండలాల వారీగా లబ్ధిదారుల వివరాలు పరిశీలిస్తే అట్లూరు మండంలో 49 మంది, బి.కోడూరు 26, బద్వేలు 31, బద్వేలు మున్సిపాలిటీ 76, బి.మఠం 53, చక్రాయపేట 45, దువ్వూరు 77, గోపవరం 25, జమ్మలమడుగు మున్సిపాలిటీల్లో 54 మంది లబ్ధిదారులను గుర్తించారు. అదే విధంగా కడప నగరంలో 218 మంది, కలసపాడు 59, కమలాపురం 86, ఖాజీపేట 92, కొండాపురం 79, లింగాల 57, ముద్దనూరు 57, మైలవరం 86, పెద్దముడియం 50, పెండ్లిమర్రి 81, పోరుమామిళ్ల మండలంలో 88 మంది లబ్ధిదారులను గుర్తించారు. అదే విధంగా ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో 135 మంది, ప్రొద్దుటూరు మండల పరిధిలో 143, పులివెందుల 37, పులివెందుల మున్సిపాలిటీ 65, రాజుపాలెం 52, మైదుకూరు 64, మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో 51, కాశినాయన 51, వల్లూరు 36, వీఎన్‌పల్లె 49, వేంపల్లె 59, వేముల 42, ఒంటిమిట్ట 50, ఎర్రగుంట్ల 72, ఎరగుంట్ల మున్సిపాలిటీ 40 మంది లబ్ధిదారులు ఉన్నారు.

పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం



స్పౌజ్ కింద పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందగానే అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాం. నిబంధనల మేరకు ప్రభుత్వానికి నివేదించాం. ఈ మేరకు ప్రభుత్వం నుంచి లబ్ధిదారుల జాబితాకు అనుమతి లభించింది. ప్రభుత్వం పింఛన్ల పంపిణీ తేదీని ఎప్పుడు ప్రకటించినా పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

- డాక్టర్ జి.రాజ్యలక్ష్మి, పీడీ, డీఆర్‌డీఏ

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రెడ్డెమ్మతల్లి

గుర్రంకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మిగా ప్రసిద్ధి చెందిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలను చేశారు. సంతానం లేని దంపతులు సంతానం కోసం ఆకు పసరు తాగి ఆలయంలో వరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో భారీ వర్షం

- చెరువులా మారిన గాంధీరోడ్డు
- ఇబ్బందులు పడ్డ వాహనదారులు



గాంధీరోడ్డులో రోడ్డుపై పారుతున్న వర్షపునీరు

ప్రొద్దుటూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఎండవేడిమికి తల్లడిల్లుతున్న జనానికి కాసింత ఉపశమనం కలిగించినా.. వర్షపు నీరు రోడ్లపైకి చేరడంతో ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం నుంచి కురిసిన వర్షానికి పట్టణంలోని ప్రధాన కాలువలు పొంగి పొర్లాయి. ముఖ్యంగా దొరసానిపల్లె చానల్, ప్రొద్దుటూరు చానల్స్‌లలో వర్షపు నీరు పొంగి గాంధీ రోడ్డుపైకి ప్రవహిస్తున్నాయి. గాంధీరోడ్డులోని సుందరాచార్యుల వీధి, సార్వకట్టవీధి దగ్గర వున్న కల్వర్టుల ఆధునీకరణ జరగకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. వర్షపు నీరు కల్వర్టు కింద నుంచి పారకుండా రోడ్డుపైకి ఎక్కుతున్నాయి. ఇటీవల మున్సిపల్ కౌన్సిల్ అజెండాలో ఈ కల్వర్టు ఆధునీకరణ పనులకు టెండర్లు పెట్టినా మున్సిపాలిటీలో వైసీపీ- టీడీపీ ఆధిపత్య పోరులో భాగంగా పనులు జరగక ఈ దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా మున్సిపల్ పాలకమండలి అధికారులు వెంటనే కల్వర్టుల ఆధునీకరణ పనులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

హార్సిలీహిల్స్‌లో సందడే.. సందడి



7

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

7

అమరావతి మహిళలకు క్షమాపణ చెప్పాలి

- కూటమి మహిళా నేతల డిమాండ్



జమ్మలమడుగు పోలీస్‌స్టేషన్లో ఎస్ఐకి వినతిపత్రం ఇస్తున్న మహిళా నాయకురాళ్లు

జమ్మలమడుగు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వారితో పాటు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని కూటమి మహిళా నాయకురాళ్లు డిమాండ్ చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కూటమి మహిళా నేతలు శేషారెడ్డిపల్లె సరస్వతి, వెంకటలక్ష్మి, భాగ్యమ్మ తదితరులు మాట్లాడుతూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో పాటు జర్నలిస్టులుగా చెలామణి అవుతున్న క్రిష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులు అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జమ్మలమడుగు అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ హైమావతికి ఫిర్యాదు అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్యకర్తలు దాడిశెట్టి వెంకటలక్ష్మి, కొర్రపాటి భాగ్యమ్మ, జి.దేవమ్మ, మచ్చా లావణ్య, భూమిరెడ్డి సరస్వతి, కోన అమరావతి, సుంకేసుల మరియమ్మ, మిడతల జయమ్మ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో...

రాజధాని అమరావతిపై మాజీ సీఎం జగన్ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని టీడీపీ మున్సిపల్ కౌన్సిలర్, న్యాయవాది గాజుల శివజ్యోతి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ మహిళా కౌన్సిలర్లతో కలిసి శివజ్యోతి మాట్లాడుతూ జగన్ టీవీ ఛానల్‌లోని చర్చా వేదికలో కృష్ణం రాజు అనే వ్యక్తితో రాజధాని అమరావతి బ్రాండ్‌ను, అక్కడ మహిళల పోరాట పటిమను దెబ్బతీసేందుకు దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. జగన్ విషపూరిత రాజకీయాలను ప్రజలు గమనించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిల్లర్లు చింతకుంట సరిత, మోతుకూరి జయలక్ష్మీలు పాల్గొన్నారు. సాయంతం వన్‌టౌన్ పోలీసుస్టేషన్లో సీఐ రామకృష్ణారెడ్డికి అమరావతి బ్రాండ్‌ను దెబ్బతీసే విధంగా రాష్ట్ర మహిళలందరిని కించపరిచే విధంగా మాట్లాడిన కృష్ణంరాజుతో పాటు దాని వెనుక సూత్రదారులందరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శివజ్యోతి పోసా వరలక్ష్మి, టీడీపీ మహిళా నాయకురాలు లక్ష్మీదేవి, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కుతుబుద్దీన్, 25 వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ నూరి తదితరులు పాల్గొన్నారు.

అమరావతి దేవతల రాజధానే

- అమరావతి జేఏసీ సభ్యురాలు పద్మశ్రీ

కడప కలెక్టరేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అమరావతి దేవతల రాజధానే నని, చంద్రబాబు వ్యాఖ్యల్లో సందేహం లేదని ఏఐసీసీ మెంబరు, అమరావతి జేఏసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ పేర్కొన్నారు. ఆదివారం కడపలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆమె పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం 29 గ్రామాలకు చెందిన రైతులు 33 వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ఇచ్చారని, అమరావతి రాజధాని నిర్మాణం జరిగితే చంద్రబాబుకు పేరు వస్తుందని భావించి జగన్ పాలనలో విస్మరించారని ధ్వజమెత్తారు. వైసీపీ దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడినప్పటికీ సాక్షి డిబేట్‌లో జర్నలిస్టు కృష్ణం రాజు, కొమ్మినేని మాటల వెనుక జగన్, భారతిల ప్రమేయం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిపై దారుణంగా మాట్లాడిన వారిని శిక్షించాలని కోరారు. ఇదిలా ఉండగా పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ఈ వ్యాఖ్యలపై ఇప్పటి వరకు నోరు మెదపలేదని విమర్శించారు. జగన్, భారతిలు వెంటనే మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా హోంమంత్రి, మహిళా కమిషన్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.



ప్రొద్దుటూరులో సీఐకి వినతిపత్రం ఇస్తున్న మహిళా నాయకురాళ్లు

ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

- ప్రభుత్వం నిరంకుశ ధోరణి విడనాడాలి
- ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైంది
- ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక



డీఈఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీటీలకు వెబ్ కౌన్సెలింగ్ విధానంలో బదిలీలు నిర్వహించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకునేంత వరకు ఉద్యమిస్తామని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు హెచ్చరించారు. ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. ప్రభుత్వం నిరంకుశ వైఖరి విడనాడాలని తెలిపారు. ఉపాధ్యాయులు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఆదివారం కడప నగరం డీఈఓ కార్యాలయాన్ని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక శివారెడ్డి మాట్లాడుతూ వెబ్ కౌన్సెలింగ్‌తో ఉపాధ్యాయులకు ఎన్నో నష్టాలు ఉన్నాయని, దీనిపై ప్రభుత్వంతో ఉపాధ్యాయ సంఘాలు చర్చించినప్పుడు ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని మాట ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు కొత్తగా వెబ్‌కౌన్సెలింగ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్లడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇది ఉపాధ్యాయ సంఘాలకు నమ్మించి మోసం చేసినట్లేనని తెలిపారు. దీనిపై అధికారులు కూడా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి, అధికారులకు ఖచ్చితంగా బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. ఉపాధ్యాయులకు ఎన్నో డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, 2023 నుంచి పీఆర్సీ బకాయిలు కూడా రావాల్సి ఉందని చెప్పారు. ఇలియాస్ బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన వెబ్ కౌన్సెలింగ్ ద్వారా అనేక పొరపాట్లు జరిగాయని, దీని ద్వారా ఎస్‌జీటీలు అధిక సంఖ్యలో ఉండడం వలన చాలామంది ఉపాధ్యాయులకు అవగాహన లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎస్‌జీటీలకు మాన్యువల్ పద్ధతిలోనే కౌన్సెలింగ్ నిర్వహించాలని, లేకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు సంగమేశ్వర్‌రెడ్డి, సురేష్‌బాబు, తిరుపాల్, విశ్వనాథ్‌రెడ్డి, లక్ష్మీరాజ, పాలెం మహేష్‌బాబు, శ్యామ్ సుందర్‌రెడ్డి, ఖాదర్‌బాష, చెన్నయ్య, కొండారెడ్డి, వివిధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చదువులమ్మ చెట్టు నీడలో..

- అంబరాన్నంటిన పాఠశాల స్వర్ణోత్సవాలు
- పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం
- గురువులకు పాదాభివందనం

పెద్దతిప్పసముద్రం జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పెద్దతిప్పసముద్రం మండలం రంగసముద్రం గ్రామంలో ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. 1974-75 నుంచి పాఠశాలలో చదివిన పూర్వపు విద్యార్థులు గురువులకు పాదాభివందనం చేసి గౌరవాభిమానాలు చాటుకున్నారు. ఆదివారం ఉదయం పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలోని సరస్వతీ దేవి విగ్రహానికి పూజలను నిర్వహించి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేశారు. 1974- 75లో స్థలాన్ని ఇచ్చి, పాఠశాలను ప్రారంభించేందుకు విశేష కృషి చేసిన రంగసముద్రంకు చెందిన కానాల జగన్నాథరావు, ఎంపీ కృష్ణారెడ్డి, నరసింహప్ప (ఎస్ఎల్ఎన్ మూర్తి) చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ తాము మానవతా విలువలతో కూడిన చదువులు చెప్పామన్నారు. అప్పట్లో ప్రభుత్వం నుంచి జీతాలు కూడా వచ్చేవి కావని, పాఠశాల కోసం స్థలాన్ని ఇచ్చి దాతలే జీతాలు కూడా ఇచ్చేవారన్నారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులందరూ ఈ వేడుకలో మళ్లీ కలవడం అపూర్వమైన అనుభూతి కలిగించిందన్నారు. 40 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమకు చదువు చెప్పిన గురువులకు పాదాభివందనం చేసి, శాలువాలతో వారిని సత్కరించారు. .మండల విద్యాశాఖాధికారి నారాయణ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలు మరువలేనివని, పాఠశాల అభివృద్ధిలో భాగంగా వారు చేస్తున్న ఈ కార్యక్రమం ఎంతో విలువైనదన్నారు. అనంతరం అదే పాఠశాలలో 2924-25 పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. సాయంత్రం వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

వైకుంఠ రథానికి రూ.1.80 లక్షలు విరాళం

కొండాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీహైస్కూల్‌లో 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు వైకుంఠ రథానికి రూ.1,80,000 విరాళం ప్రకటించారు. ఆదివారం జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు చెంచిరెడ్డి అభ్యర్థన మేరకు ఈ విరాళం ప్రకటించినట్లు పూర్వ విద్యార్థులు శివశ్రీనివాసులరెడ్డి, బాలనాగిరెడ్డి, ఖాదర్‌బాషా తదితరులు తెలిపారు. కొండాపురం పరిసర ప్రాంతాల ప్రజలు వైకుంఠ రథం లేక ఇబ్బంది పడుతున్నారని, అందుకే దీనిని విరాళంగా ఇవ్వనున్నట్లు వారు తెలిపారు.


కొండాపురం జడ్పీహైస్కూల్‌లో పూర్వపు విద్యార్థులు


చెక్కును అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మేముసైతం..

- పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం

ఎర్రగుంట్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు రూ.30వేలు విరాళంగా ఇచ్చారు. ఎర్రగుంట్ల బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975-76 బ్యాచ్‌కు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఎర్రగుంట్లలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ బ్యాచ్‌కు చెందిన మాజీ ఏఎంసీ ఎస్.సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, అన్వర్, మల్లారెడ్డి, వాసుదేవరెడ్డి, జయరాం తదితరులు మాట్లాడుతూ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగిన వారు ఎందరో ఉన్నారన్నారు. ఈ పాఠశాలను ఎన్నటికీ మరువలేమన్నారు. తమ పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు కర్తవ్యంగా ఈ ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ముందుభాగంలో ఉన్న ప్రహరీపై దేశనాయకులు, శాస్త్రజ్ఞులు, స్వాతంత్ర్య సమర యోధులు, మేధావుల చిత్రాలు వేసేందుకు ఈ డబ్బును ఉపయోగించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన చెక్కును పాఠశాల హెచ్ఎం రామాంజనేయరెడ్డి, చంద్ర ఓబుళరెడ్డికి అందజేశారు.

ఏపీఈఏపీసెట్‌లో 'నారాయణ' హవా


షేక్ అబ్దుల్ పల్లవి జగత్‌స్మరణ్ రెడ్డి రమ్యసాయి శ్రీలేఖ


సాలెహా రామ్‌శరణ్, ఐశ్వర్యరాజ్ ధనుష్ సుజన

కడప ఎడ్యుకేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీసెట్ 2025 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు హవా కొనసాగిందని నారాయణ విద్యాసంస్థల డీజీఎం రామ్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫలితాలకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో 1000లోపు ర్యాంక్‌లు సాధించారన్నారు. అబ్దుల్ హసీమ్ 146, పల్లవి 232, జగత్ స్మరణ్ రెడ్డి 351, శ్రీలేఖ-410, రామ్‌శరణ్ 566, ఐశ్వర్యరాజ్ 587, ధనుష్ 764, రమ్యసాయి 772, సాలిహా 899, సుజనా 979 టాప్ ర్యాంక్స్ సాధించారన్నారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులను డీన్ చంద్రకిషోర్‌రెడ్డి, సుబ్బారావు, బాలవెంకటరెడ్డి, ఏజీఎం చెన్నకృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి, ప్రిన్సిపాల్ మురళీమోహన్, వెంకటస్వామి, సుధాకరరెడ్డి, సౌజన్య ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఏపీఈఏపీసెట్‌లో 6254 మంది ఉత్తీర్ణత

రాయచోటిటౌన్, జూన్8(ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీ సెట్‌లో అన్నమయ్య జిల్లా నుంచి 6254 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశం కోసం ప్రభుత్వం నిర్వహించిన ఏపీ ఎంసెట్‌కు అన్నమయ్య జిల్లా నుంచి 9854 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ప్రభుత్వం మే నెలలో నిర్వహించిన పరీక్షలకు 9444 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 6254 మంది ఉత్తీర్ణత సాధించారు. అర్హత సాధించిన వారికి ఈనెల చివరలో ఆయా కళాశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వం కౌన్సెలింగ్ నిర్వహించనుంది.

లారీ,ఆటో ఢీ.. ఒకరు మృతి

మైదుకూరు రూరల్ ,జూన్ 8(ఆంధ్రజ్యోతి) : లారీ, ఆటో ఢీకొనడం ఉప్పుగుంటపల్లెకు చెందిన వెంపర్ల చిన్న వెంకటసుబ్బయ్య (65) అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మైదుకూరు నుంచి బద్వేల్ వైపు వెళుతున్న లారీ, జీవి సత్రం నుంచి మైదుకూరు వైపునకు వస్తున్న ఆటో స్థానిక బద్వేల్ రోడ్డులోని ఫైపుల ఫ్యాక్టరీ సమీపంలో ఆదివారం ఢీకొన్నాయి. దీంతో ఆటోలోని వ్యక్తి లారీ కింద పడి అక్కడిక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.మైదుకూరు పట్టణానికి వెలుపల జరుగుతున్న రోడ్డు పనుల్లో భాగంగా గుత్తేదారుల నిర్లక్ష్యం వలన ఈ మధ్య కాలంలో ముగ్గురు మృతి చెందారు. రోడ్డుపై ఎలాంటి సూచిక బోర్డులు లేక పోవడమే ఈ ప్రమాదాలకు కారణమని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సూచిక బోర్డులను పెట్టి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

బైక్‌లు ఢీకొని ఒకరు..

వీరపునాయునిపల్లె, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాయసంపల్లె గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమా దంలో ఒకరు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీ సుల కథనం మేరకు సికెదిన్నె మండలం తాడిగట్ల గ్రామానికి చెందిన ముంతా రవి (35), లేవనూరు నాని ద్విచక్రవాహనంపై సంతకొవ్వూరు గంగమ్మ దర్శనా నికి వెళ్తుండగా పాయసంపల్లె సమీపంలో మరో బైక్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ముంతా రవి అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన లేవనూరు నానిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మంజునాథ్ తెలిపారు.


సంఘటన స్థలంలో పడి ఉన్న ద్విచక్రవాహనాలు

బైక్‌లను ఆటో ఢీకొనడంతో ఒకరు..

రాజంపేట టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఒక ఆటో ఒకదాని వెనుక ఒకటి వస్తున్న రెండు బైకులను ఢీకొనడంతో వెంకటరత్నం(52) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి కడపకు చెందిన ఎ.వెంకటరత్నం, నవీన్‌కుమార్ ఆదివారం పెనగలూరు మం డలం ఓబిలి గ్రామంలో అంత్యక్రియలకు హాజరై తిరిగి వస్తుండగా పట్టణంలోని బైపాస్‌లో ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకట రత్నం మృతి చెందగా, నవీన్ కుమార్‌కు గాయాలయ్యాయి. అదే ఆటో వీరి వెనుకే వస్తున్న మరో బైక్‌ను సైతం ఢీకొంది. దీంతో ఆ బైకుపై ప్రయాణిస్తున్న రాజంపేట తహసీల్దారు కార్యాలయ ఉద్యోగి మణి, ఎల్.సుమలత గాయపడ్డారు. వీరిని తిరుపతికి తరలించారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజంపేట పట్టణ పోలీసులు తెలిపారు.


వెంకటరత్నం (ఫైల్ ఫొటో)

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

కమలాపురం రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యో తి): వడదెబ్బ కారణంగా ఉపాధికూలీ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు మండల పరిధిలోని కొండాయపలెకు చెంది న చిట్టిబోయిన ఓబులేసు (53) శనివారం ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. పని పూర్తయిన అనంతరం ఇంటికి వస్తుండ గా వడదెబ్బకు గురయ్యాడు. వెంటనే బంధువులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుం బ సభ్యులు తెలిపారు. ఈ విషయంపై ఏపీవో పార్థసారథి మాట్లాడుతూ ఓబులేసు ఉపాధి పనికి వచ్చిన మాట వాస్తవమేనని, మస్టరులో కూడా పేరు నమోదు చేశారని, అయితే మార్గమధ్యం లో వడదెబ్బ తగలడంతో శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారని తెలిపారు. డాక్టరు రిపోర్టు తీసుకుని ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

కారు ఢీకొని ఏఎస్ఐకి గాయాలు

చెన్నూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో ఏఎస్ఐ తీవ్రం గా గాయపడ్డాడు. సింహాద్రిపురం మండలంలో ఏఎస్ఐగా పని చేస్తున్న పి.సుధాకర్ ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంలో చెన్నూరు కు వస్తుండగా కొత్తరోడ్డు వద్ద కడప నుంచి ఖాజీపేట వైపు వెళుతున్న కారు వెనుకనుంచి ఢీకొంది. దీంతో గాయపడిన ఆయనను స్థానికులు కడపలోని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నూరు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్టాండులో చిన్నారి.. సంరక్షణకు ఎస్ఐ చర్యలు

పోరుమామిళ్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో పలువురు పిల్లల కోసం హాస్పిటళ్ల చుట్టూ తిరిగి డబ్బులు ఖర్చు చేస్తున్నారు. కానీ కొందరు తమ పిల్లలే భారంగా భావించి ఎక్కడ పడితే అక్కడ వదిలేస్తున్నారు. అలాంటి సంఘటనే ఆదివారం పోరుమామిళ్లలో జరిగింది. స్థానిక ఆర్టీసీ బస్టాండులో తొమ్మిదినెలల చిన్నారిని ఎవరో వదిలేసి వెళ్లారు, ఎన్ని గంటలైనా ఎవరూ రాకపోవడంతో అక్కడి వారు ఎస్ఐ కొండారెడ్డికి సమాచారం అందించారు. వెంటనే ఆయన చిన్నారిని పోలీసుస్టేషన్‌కు తీసకువచ్చి విచారణ చేశారు. ఎటువంటి సమాచారం రాకపోవడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు అప్పజెప్పి, శిశు సంక్షేమశాఖలో చేర్చేందుకు చర్యలు తీసుకున్నారు.

48 ఎర్ర చందనం దుంగలు స్వాధీనం

- నలుగురు అరెస్ట్

తంబళ్లపల్లె, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 48 ఎర్రచందనం దుంగలు, ఓ ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేసినట్లు తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ ఆర్ఐ చిరంజీవులు,, ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం, స్థానిక అటవీ శాఖ అధికారులు జయప్రసాదరావు, మోహన్‌రెడ్డి, షబీన్‌తాజ్ సహకారంతో బి. కొత్తకోట మండలం బురకాయలకోట అటవీ ప్రాంతంలోని వేపూరికోట ఫారెస్ట్ బీటు పరిధిలో ఆదివారం తెల్లవారుజామున తనిఖీలు చేస్తుండగా తంబళ్లపల్లె మండలం అన్నగారిపల్లె సమీపంలోని వంక గట్టున ఓ ద్విచక్రవాహనం కనిపించింది. దీంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా, కొందరు పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో తనిఖీ చేయగా, 48 ఎర్రచందనం దుంగలు లభించినట్లు తెలిపారు. పట్టుబడిన వారు ములకలచెరువు మండలం సోంపల్లెకు చెందిన సుధాకర్, రాజుగారిపల్లెకు చెందిన లక్ష్మీపతినాయుడు, పెద్దమండ్యం మండలం కురవపల్లెకు చెందిన మల్లికార్జున, గుర్రంకొండ మండలం మద్యాన్వాంవారిపల్లెకు చెందిన సురేంద్రరెడ్డి గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడినవారితో పాటు, ఎర్రచందనం దుంగలు, ద్విచక్రవాహనాన్ని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పట్టుబడిన ఎర్రచందనం దుంగలతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మహిళ విషయంలో రెండు గ్రామాల మధ్య ఘర్షణ

- పలువురికి తీవ్రగాయాలు

రామసముద్రం/ మదనపల్లెటౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత కుటుంబాన్ని వదిలి ప్రియుడితో కలసి వెళ్లిపోయి రెండు కుటుంబాలు, రెండు గ్రామాల మధ్య ఘర్షణకు కారణమైంది. శనివారం రాత్రి ఇరువర్గాలు ఒకరిపై ఒకరు కర్రలు, కత్తులతో దాడి చేసుకోవడంతో ఏడుగురు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే కమ్మవారిపల్లె పంచాయతీ బొర్రబోయనిపల్లెకు చెందిన ఓ వివాహిత పది రోజుల క్రితం తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఆర్.నడింపల్లె పంచాయతీ శ్రీరాముల పల్లెకు చెందిన ఓ యువకుడితో వెళ్లిపోయింది. ఈ విషయమై ఎర్రబోయనపల్లెకి చెందిన గంగప్ప, శ్రీరాములపల్లికి చెందిన వెంకటప్ప కుటుంబాల మధ్య పదిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఎస్ఐ రవికుమార్ శనివారం రెండు వర్గాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి రాజీ కుదిర్చి, గొడవపడకూడదని సర్ది చెప్పి, స్టేట్‌మెంట్ తీసుకుని పంపేశారు. ఆదివారం మళ్లీ ఇరువర్గాల మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో కర్రలు, కొడవళ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో కమ్మవారిపల్లె పంచాయతీ ఎర్రబోయనపల్లెకి చెందిన మాజీ సర్పంచ్ కె.చిన్న వెంకటప్ప(67), కె.వెంకటరమణ(45), యశ్వంత్(25), సుధాకర్ (35), కె.గంగాధర్(30), విశ్వనాథ్ గాయపడగా ప్రత్యర్థి వర్గానికి చెందిన శ్రీరాములపల్లె వెంకటప్ప, అతని అనుచరులు కృష్ణమూర్తి, వెంకటరమణకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో కొందరు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో, కొందరు కోలార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం క్షతగాత్రులను మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రాష్ట్ర టీడీపీ యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు పరామర్శించారు. శ్రీరామ్ చినబాబు క్షతగాత్రులను రాష్ట్ర హోంమంత్రితో ఫోన్‌లో మాట్లాడించి అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యం చెప్పినట్లు సమాచారం. ఇదిలా ఉండగా మహిళ తండ్రి శాంతప్ప తనకు కొంత డబ్బు ఇవ్వాల్సి ఉందని, డబ్బు అడిగినందుకు తనపై దాడి చేశారని శ్రీరాములపల్లెకు చెందిన వెంకటప్ప ఆరోపిస్తున్నారు. మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి చేరుకుని ఘటనకు గల కారణాలను ఆరా తీసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామసముద్రం ఎస్ఐ రవికుమార్ తెలిపారు.


క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

హార్సిలీహిల్స్‌లో సందడే.. సందడి


స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు


అందమైన లొకేషన్‌లో యువజంట ఫొటోషూట్

బి.కొత్తకోట, జూన్8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రాఊటీగా పేరుగాంచిన హార్సిలీహిల్స్‌లో ఆదివారం సందడి నెలకొంది. వేసవి సెలవులు ఈ వారంతో ముగియనుండటం, బక్రీద్ పండుగ మరుసటి రోజుతో పాటు, వారాంతం కావడంతో పలు వర్గాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో హిల్స్‌కు చేరుకున్నారు.దీంతో శనివారం రాత్రి ఏపీ టూరిజంకు చెందిన 57 అద్దె గదులూ భర్తీ కావడంతో పాటు, ప్రైవేటు రెస్టారెంట్లు, అతిథిగృహాల కిక్కిరిశాయి. ఆదివారం స్విమ్మింగ్‌పూల్‌లో సేదతీరుతూ, గాలిబండ, ఏరియల్ వ్యూ పాయింట్ నుంచి 4312 అడుగుల కిందనున్న ప్రకృతి అందాలను తిలకిస్తూ ఉల్లాసంగా గడిపారు. అటవీశాఖ ప్రాంగణంలోని జూపార్క్, మానస సరోవరంలో బోటింగ్ వద్ద పర్యాటకుల రద్దీ కనిపించింది. ప్రాంగణంలోని హార్సిలీహిల్స్ ఐకాన్‌తో పాటు, సుందరమైన లొకేషన్లలో పలు నూతన జంటలు ఫోటోషూట్‌లో పాల్గొనడం కనిపించింది. కొండపై ఎక్కడచూసినా జనసంచారం కనిపించింది.

'సీపీఎం కార్యకర్తలు సైద్ధాంతిక స్థాయిని పెంచుకోవాలి'

కడప సెవెన్ రోడ్స్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారీ సమాజంలో దోపిడీ, పెత్తందారుల దుర్మార్గాలు, అన్యాయాలను ప్రశ్నించాలంటే సైద్ధాంతిక, రాజకీయ, సామాజిక స్పృహ స్థాయిని తప్పనిసరిగా పెంచుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు, సీనియర్ నాయకుడు దడాల సుబ్బారావు కార్యకర్తలకు సూచించారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో శాస్త్రీయ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనతా ప్రజాతంత్ర విప్లవ వ్యూహం, ఎత్తుగడలు, విప్లవ దశలు, పార్టీ కార్యక్రమం దశ, దిశలు వంటి వాటిపై పూర్తిస్థాయిలో తెలుసుకోవాలని తెలిపారు. జమీందారులు, భూస్వాముల ఆర్థిక, సామాజిక, మానసిక దోపిడీలకు వ్యతిరేకంగా ఆనాడు పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించి, ప్రజాచైతన్యంతో తిరుగుబాటు చేసి లక్షలాది ఎకరాలు దున్నేవాడికి భూ పంపిణీ చేశారని తెలిపారు. పెట్టుబడిదారీ సమాజంలో పాలకుల ప్రజావ్యతిరేక విధానాలు, మతోన్మాద శక్తులను ఎదుర్కోవాలంటే సీపీఎం కార్యకర్తలు ఉక్కు క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్ వి.అన్వేష్, జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామ్మోహన్, వి.మనోహర్, కె.శ్రీనివాసులరెడ్డి, బి.దస్తగిరిరెడ్డి, కె.సత్యనారాయణ, కె.శ్రీనివాసులు, కుమారస్వామిరెడ్డి, చంద్రారెడ్డి, శివరామ్, వెంకటేశ్వర్లు, వి.శివకుమార్, జి.సునీల్‌కుమార్, చిన్ని, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

దొంగ అరెస్టు: బంగారం స్వాధీనం

కడప క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పలు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని ఆదివారం కడప ఎయిర్‌పోర్టు వద్ద అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ ఓబులేసు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కడప మోచంపేటలోని చిలకలబావికి చెందిన షేక్ అక్బర్ ఆలీ ఎలక్ట్రీషియన్ . క్రికెట్ బెట్టింగ్, జూదాలకు అలవాటుపడ్డాడు. వాటికి అవసరమయ్యే డబ్బుకోసం చోరీలు ప్రారంభించాడు. .ఈ నేపథ్యంలో కడప నగరంలోని వివిధ పోలీసుస్టేషన్‌లలో ఇతనిపై దాదాపు 20 కి పైగా కేసులు నమోదయ్యాయి. దొంగతనం కేసులో జైలుకు వెళ్లి తిరిగి వచ్చినా, చోరీలు మానుకోలేదు. ఇటీవల ఎన్జీవో కాలనీ, మృత్యుంజయకుంట, అక్కాయపల్లెలో చోరీ చేసిన బంగారు నగలు తీసుకుని పారిపోతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి అక్బర్ ఆలీని అరెస్టు చేసి, 40.160 గ్రాములు బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని రిమాండుకు తరలించినట్లు వివరించారు.

ఏరువమ్మ ఆలయంలో చోరీ

వీరబల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దిగువరాచపల్లి పంచాయతీలో ఉన్న ఏరువమ్మ ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ పూజారి నాగభూషణం కథనం మేరకు ఆదివారం ఉదయం ఆలయం తలుపులు తెరిచేసరికి అమ్మవారి వస్త్రాలు, ఆభరణాలు చిందరవందరగా పడి కనిపించాయి. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కాగా, ఆలయంలోని నగలు బంగారంతో చేసినవి కాదని భావించి అక్కడే పడేసి వెళ్లినట్లు పూజారి తెలిపారు. నిందితులను గుర్తించి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గురిజాలలో గాలి వానకు నేలకొరిగిన అరటి

సింహాద్రిపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురిజాల గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం పెనుగాలులు, వానకు అరటిచెట్లు నేలకొరిగి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. గ్రామంలో రామ్మోహన్‌రెడ్డికి చెందిన 2500, చెన్నకేశవరెడ్డికి చెందిన 1000 , శ్రీధర్‌రెడ్డికి చెందిఇన 300అరటి చెట్లతోపాటు, సింహాద్రిపురంలో మరికొంతమంది కి చెందిన అరటిచెట్లు గాలికి పడిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యాలు



కడప కల్చరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రిమ్స్ సమీపంలోని శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా చిన్నారులు చేసిన నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. శిల్పారామంలోని సాంస్కృతిక కళావేదికపై నగరానికి చెందిన అఖిల్ డ్యాన్స్ మాస్టర్ సారథ్యంలో చిన్నారులు వివిధ జానపద, కూచిపూడి, సినిమా పాటలకు నృత్యాలు చేశారు. అలాగే జబర్దస్త్ రన్నింగ్ రాజు, హర్షితల కామెడి స్కిట్లు విశేషంగా అలరించాయి.

సీనియర్ సిటిజన్ల యోగా



యోగాసనాలు చేస్తున్న వృద్ధులు

పులివెందుల రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం సీనియర్ సిటిజన్‌లు యోగా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో 75ఏళ్లు పైబడిన వారికి యోగా ప్రయోజనాల గురించి వివరించారు. వృద్ధాప్యంలో చేయాల్సిన కొన్ని ఆసనాలను చేయించారు. యోగాతో మానసికంగా ప్రశాంతత లభిస్తుందని, ధ్యానం, ప్రాణాయామం తప్పనిసరిగా చేయాలని కమిషనర్ రాముడు సూచించారు. కార్యక్రమంలో యోగా గురు వెంకటరామిరెడ్డి, ఆర్వో మునికుమార్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రం చెప్పిన సమస్య



మ్యాన్‌హోల్ ఓపెన్

పులివెందుల రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపాలిటీలోని పలు ప్రాంతాలలో మ్యాన్‌హోల్స్‌పై మూతలు కరువయ్యాయి. మూతలు లేకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధిలో పిల్లలు ఆడుకునే సమయంలో ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రమాదం జరగకముందే అప్రమత్తం కావాలని కోరుతున్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

- సేవలు వినియోగించుకుని పోలీసు భద్రత పొందండి
- శిల్పారామం సందర్శకులకు యాప్‌పై అవగాహన



శక్తియాప్ గురించి వివరిస్తున్న ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్

కడప క్రైం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): శక్తియాప్ మహిళలు, బాలికలకు ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని రిమ్స్ పోలీసుస్టేషన్ ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్ అన్నారు. శక్తియాప్ ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి ఆదివారం సాయంత్రం నగర శివారులోని శిల్పారామం సందర్శకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి మహిళ, బాలికలు, విద్యార్థినులు తమ స్మార్ట్‌ఫోన్‌లోని ప్లేస్టోరులో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వ్యక్తిగత వివరాలు, ఫోను నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఎస్‌వోఎస్ బటన్, డయల్ 112 నెంబరు ద్వారా ఫిర్యాదు చేయగా పది నిమిషాల్లో సంబంధిత పోలీసులు మీవద్దకు చేరుకుని సమస్యను, ఆపదను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాలపై డయల్ 100, 112, చైల్డ్‌లైన్ 1098, గృహహింస 181, మహిళ వేధింపులు 1091, సైబర్ టోల్‌ఫ్రీ 1930నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత, రక్షణ కోసం అందుబాటులోకి తీసుకువచ్చిన ఈ యాప్ ఉపయోగం, సేవల గురించి జిల్లాలో విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ పద్ధతిలో బదిలీలు నిర్వహించాలని ఆపస్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఉపాధ్యాయ సంఘాల చర్చల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మాన్యువల్ పద్ధతిలోనే బదిలీలు నిర్వహించాలని కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి వెంకటరామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎరికలరెడ్డి, కోశాధికారి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కడప రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు



రైల్వేస్టేషన్‌లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కడప క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వేస్టేషన్‌లో ఆదివారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కడప వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ రైల్వే పోలీసులతో కలిసి ఉదయం రైల్వేస్టేషన్ మొత్తం పరిశీలించడంతో పాటు అనుమానాస్పద వ్యక్తుల బ్యాగులను తనిఖీ చేశారు. అలాగే డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు.

285 క్వింటాళ్ల వేరుశనగ కాయలు మంజూరు



పులివెందుల, జూన్ 8(ఆంధ్రజ్యోతి): తొండూరు మండలానికి 180 క్వింటాళ్ల టీసీజీఎస్-1694 (వశిష్ట), 60క్వింటాళ్ల నారాయణి, 45క్వింటాళ్ల కే-6 రకం వేరుశనగ కాయలు కేటాయించినట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.మధుసూదన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రాలలో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకొని డబ్బులు చెల్లించాలన్నారు. ఈ సీజన్‌కు టీసీజీఎస్-1694, కే-6 రకాలను 40శాతం సబ్సిడీతో కేజీ రూ.55.80, నారాయణి రకం 40శాతం సబ్సిడీతో కేజీ రూ.57లతో అందిస్తున్నట్లు తెలిపారు. అర ఎకరా ఉన్న వారికి ఒక బస్తా, ఒకటిన్నర ఎకరాలకు రెండు బస్తాలు, ఎకరం కంటే ఎక్కువ ఉంటే మూడు బస్తాలు అందిస్తున్నట్లు తెలిపారు. 30 కేజీల కే-6/టీసీజీఎస్-1694రకం రూ.1674, 30 కేజీల నారాయణి రకం వేరుశనగ కాయలకు రూ.1710 చెల్లించాలన్నారు.

ముగిసిన భాగవత పఠనం

లింగాల, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబకపల్లె గ్రామంలో వెలసిన ఆవులస్వామి ఆలయంలో భాగవత సప్తాహ పఠనం ఆదివారంతో ముగిసింది. ఆలయం చుట్టూ కలశ ప్రదర్శనం నిర్వహించారు. ఈ సందర్భంగా భాగవత పండితులను గ్రామస్థులు సన్మానించారు. పార్నపల్లెలో ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకు భాగవత సప్తాహ పఠనం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామంలోని కల్యాణ రామస్వామి ఆలయంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



భాగవతపఠనం పఠిస్తున్న దృశ్యం

క్లస్టర్ లెవెల్ అకడమిక్ టీచర్స్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ జూన్ 8 (ఆంధ్రజ్యోతి): క్లస్టర్ లెవెల్ అకడమిక్ టీచర్స్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని సీఆర్ఎంటీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ ఆదిమూలం శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సీఆర్ఎంటీలకు శాపంగా మారుతున్నాయన్నారు. ఇటీవల విద్యాశాఖలో వివిధ కేటగిరీలలో ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు చేయగా మిగిలిపోయిన ఉపాధ్యాయులను క్లస్టర్ లెవెల్‌లో అకడమిక్ టీచర్లుగా ఉపయోగించుకోవడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులుగా ఉన్న క్లస్టర్ రీసోర్స్ పర్సన్‌లను వారి అర్హతలను బట్టి బోధనకు ఉపయోగించుకునేవిధంగా క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ (సీఆర్ఎంటీ) వ్యవస్థను జీవో నెంబర్ 65 ప్రకారం 2023లో తీసుకువచ్చిందన్నారు. ఈ జీవో ప్రకారం సీఆర్‌పీ విధానం రద్దు అయి సీఆర్ఎంటీ విధానం ప్రస్తుతం అమలులో ఉందన్నారు. క్లస్టర్ పరిధిలో ఏ టీచర్ అయినా సెలవు పెడితే వారి స్థానంలో వీరు పాఠశాలలకు హాజరై విద్యార్థులకు బోధన అందిస్తున్నారన్నారు. నేటి విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులు సెలవు పెట్టిన రోజులలో ప్రత్యామ్నయంగా డిప్యుటేషన్ వెళ్లడానికి సీఆర్ఎంటీ వ్యవస్థ ఉన్నప్పటికీ మిగులు ఉపాధ్యాయులను ఏమి చేయాలో అర్థంకాక క్లస్టర్ లెవెల్ అకాడమిక్ టీచర్ విధానాన్ని ప్రవేశపెడుతోందని, ఈ విధానాన్ని సీఆర్ఎంటీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకొని సీఆర్ఎంటీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్ట్ టోర్నీ విజేతకు అభినందనలు : ఎమ్మెల్సీ



జట్టును అభినందిస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి జర్నలిస్ట్ టోర్నీలో విజేతగా నిలిచిన కడప జట్టును ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అభినందించారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్సీ స్వగృహం వద్ద కడప జర్నలిస్టు జట్టు ఆయనను కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో కడప జట్టు విజేతగా నిలవడం సంతోషకరమని ఎమ్మెల్సీ అన్నారు. అలాగే త్వరలో జరిగే జర్నలిస్టు క్రీడా పోటీలకు తాను పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

గంగమ్మకు పూజలు

సీకేదిన్నె, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె గంగమ్మతల్లికి భక్తులు ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు చేసి అమ్మవారి సన్నిధిలో ఆనందంగా గడిపారు.

నిరాహార దీక్షలను జయప్రదం చేయండి

- ఐక్యవేదిక పిలుపు

కడప ఎడ్యుకేషన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం డీఈవో కార్యాలయం ఆవరణలో ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాల దగ్గర నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. మంగళవారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం (విద్యాభవన్) ముట్టడి నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు ఇలియాస్ బాష, మోపూరి వెంకటశివారెడ్డి, పాలెం మహేష్‌బాబు, గుజ్జల తిరుపాల్, అబ్దుల్లా, ఖాదర్‌బాష, చంద్రమోహన్, రమణారెడ్డి, బత్తిన నాగేశ్వర్‌రావు, లెక్కల జమాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యతో ఉన్నత శిఖరాలు

- అన్నమయ్య జిల్లా డీఈవో సుబ్రమణ్యం



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

కడప మారుతీనగర్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, అంకిత భావం, ఇష్టపడి, కష్టపడి విద్యనభ్యసించినట్లయితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి కె.సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. 2024-25 విద్యాసంవత్సరానికి పదవ తరగతి, ఇంటర్మీడియట్ విభాగంలో అత్యుత్తమ మార్కులతో ర్యాంకులు సాధించిన 47మంది పద్మశాలీయ విద్యార్థులకు పద్మశాలీయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పద్మశాలీయ కళ్యాణ మండపంలో నగదు, ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ముందస్తు లక్ష్యాలు నిర్దేశించుకుని ఒక ప్రణాళిక ప్రకారం గమ్యస్థానం చేరేందుకు ముందుకు సాగాలన్నారు. అనంతరం పద్మశాలీయసేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అవ్వారు వెంకటసుబ్బయ్య, అధ్యక్షుడు అవ్వారు సుబ్బరాయుడు మాట్లాడుతూ విద్యార్థులలో దాగి వున్న ప్రతిభను మరింతగా పెంపొందింపచేయాలనే ఏకైక ధ్యేయంతో విద్యలో రాణించిన వారికి గత 19 సంవత్సరాలుగా నగదు, ప్రతిభా పురస్కారాలను అందిస్తూ, అభినందిస్తున్నామన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సంఘం విద్యాకమిటీ కన్వీనర్ వెంకటసుబ్బయ్య, రాటాల గోపి, బి.వి. సుబ్బరాయుడు, పుత్తా శివరామయ్య, వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయోత్సవ ర్యాలీలు హాస్యాస్పదం : తులసిరెడ్డి

వేంపల్లె,జూన్ 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించడం హాస్యాస్పదమని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధులు తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సంవత్సర కాలంలో ఒకటిన్నర లక్షల కోట్లు అప్పులు చేసినందుకా, విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15480కోట్లు అదనపు భారం మోపినందుకా, రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా, డ్రగ్గాంధ్రప్రదేశ్‌గా, గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చినందుకా?.. నిరుద్యోగ భృతి చెల్లించకుండా యువతను నమ్మించి మోసగించినందుకా?, తల్లికి వందనం హామీని అమలు చేయకుండా తల్లులను, పిల్లలను నమ్మించి మోసగించినందుకా?, అన్నదాత సుఖీభవ హామీని అమలు చేయకుండా అన్నదాతలను నమ్మించి మోసగించినందుకా, ఆడబిడ్డ నిధిని అమలు చేయకుండా ఆడబిడ్డలను మోసగించినందుకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ ముస్లిం మైనార్టీలకు 50ఏళ్లకే పింఛన్ ఇస్తామని చెప్పి అమలు చేయనందుకా అని ప్రశ్నించారు. విభజన చట్టంలోని అంశాలనుసాధించకుండా ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని నరేంద్రమోడీ వద్ద తాకట్టుపెట్టినందుకా అని ప్రశ్నించారు. విజయోత్సవ ర్యాలీలు చేసుకునే అర్హత టీడీపీ కూటమి పార్టీలకు ఏమాత్రం లేదని చెప్పారు.

డ్రోన్ టెక్నాలజీని వినియోగించుకోవాలి

సీకేదిన్నె, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ టెక్నాలజీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ పరిశోధనస్థానం శాస్త్రవేత్త డాక్టర్ మాధురి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం గోర్లపల్లి, బాలుపల్లి గ్రామాల్లో ఆదివారం కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సస్యరక్షణ చర్యలు త్వరగా చేపట్టేందుకు, తక్కువ సమయంలో పంటలను కాపాడుకునేందుకు డ్రోన్ టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మినుములు, నువ్వులు, తదితర పంటల్లో యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. పశువిజ్ఞాన శాస్త్రవేత్త సురేష్‌కుమార్‌రెడ్డి పశువుల పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గిరీష్‌కుమార్, శిరీష, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

యాదవభవన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలి

కడప మారుతీనగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన కడపలో యాదవ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని రాయలసీమ యాదవ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.నారాయణ యాదవ్ కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ ఫండ్ నుంచి కొందరు కుట్రపూరితంగా కొంత నగదు డ్రా చేసుకోవడం దారుణమన్నారు. ఈ విషయమై సంబంధిత వారిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు శ్రీరాములు యాదవ్, శ్రీనివాసులు యాదవ్, నరసింహులు యాదవ్, బాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణే ధ్యేయం



వాటర్ స్కీమ్‌ను ప్రారంభిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

చక్రాయపేట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామని, అవసరమొచ్చిన చోట బోర్లు వేస్తున్నామని టీడీపీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మూలపల్లె, కొండప్పగారిపల్లె, దేవరగుట్టపల్లె గ్రామాలలో వాటర్ స్కీములను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ గ్రామంలోనైనా నీటి ఎద్దడి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం జలగంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినికి షైనింగ్ స్టార్ అవార్డు



బి.జయశ్రీ

పులివెందుల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్ పేరిట అవార్డులు ప్రకటించింది. ఈ అవార్డుకు తొండూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాల విద్యార్థిని బి.జయశ్రీ (549 మార్కులు) ఎంపికైనట్లు గురుకులం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అభినందించారు.

విద్యుత్ షాక్ తగిలి గేదె మృతి

పెండ్లిమర్రి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుర్రాల చింతలపల్లె గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి ఆదివారం నాగేశ్వర్‌రెడ్డికి చెందిన గేదె మృతి చెందింది. గ్రామస్థులు బీఎస్ఎన్ఎల్ టవర్‌కు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవుతుందని అధికారులకు తెలిపినా పట్టించుకోక పోవడంతో ఈ ప్రమాదం జరిగిందని రైతు వాపోయాడు.

పంట మార్పిడితో అధిక ఫలసాయం

కమలాపురం రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): విత్తనశుద్ధి, పంట మార్పిడిలతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని, మంచి దిగుబడి సాధించవచ్చని కేవీకే శాస్త్రవేత్త బాలక్రిష్ణ తెలిపారు. ఆదివారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దేవరాజుపల్లె, సముద్రంపల్లె, జీవంపేట, చిన్నపుత్త, దాదిరెడ్డిపల్లె, అప్పారావుపల్లె, గోలపల్లి, జంబాపురం గ్రామాల్లో వేరుశెనగ పంట సాగు విధానాలపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏడీఏ నరసింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉద్యానపంటలపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉద్యాన పంటలు సాగు చేసే సమయంలో అవసరమైన మెలకువలు తెలుసుకోవాలని, అలాగే అంతర పంటలు కూడా సాగు చేసుకొని అధిక లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బరాయుడు, డాక్టర్ శ్యాంప్రసాద్, ఉమకాంత్, మండల వ్యవసాయాధికారి సరస్వతి, రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి

అపూర్వం.. పూర్వ విద్యార్థుల కలయిక



తరగతి గదిలో పూర్వ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులు 36 ఏళ్ల తర్వాత ఒక్కటయ్యారు. చిన్న నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. కడప నగరం అలంఖాన్‌పల్లెలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 1988-1989 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులు బాలయల్లారెడ్డి, భగీరథమ్మలను ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు. అనంతరం నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. కార్యక్రమంలో రేవిళ్ల నాగేంద్రప్రసాద్, జానకీరామ్, రఘునాథరెడ్డి, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని బిల్టప్ సమీపంలో ఉన్న విజయదుర్గాదేవి ఆలయంలో ఆదివారం విజయదుర్గాదేవి, మల్లికార్జునస్వాముల కల్యాణోత్సవాన్ని భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

ప్రతి ఏడాది జూన్ నెల నుంచి పంటలు సాగు చేసేందుకు రైతాంగం సమాయత్తం అవుతుంది. ఈ ఏడాది వర్షాలు ఆరంభంలో బాగా కురియడంతో ఖరీఫ్ సీజన్ పంటలు సాగు చేయడానికి రైతన్నలు కోటి ఆశలతో ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే ట్రాక్టర్లతో దుక్కులు దున్నడంతో పాటు పశువుల ఎరువునుతోలి సాగుకు సిద్ధమవుతున్నారు


చాపాడు పొలంలో కుప్పలుగా వేసిన ఎరువు


పోరుమామిళ్లలో వరి నార్లు వేసేందుకు పొలాన్ని తయారు చేసుకుంటున్న రైతు

చాపాడు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రుతుపవనాల ఆరంభంలో వర్షాలు బాగా కురియడంతో రైతులు పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. కోటి ఆశలతో పంటలు సాగు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ట్రాక్టర్లతో దుక్కులు దున్ని పశువుల ఎరువును భూముల్లోకి తోలి పంట సాగుకు భూమిని సర్వం సిద్ధం చేశారు. మండలంలోని రైతులు ఎక్కువ భాగం వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. మండలంలో మొత్తం 32 వేల ఎకరాల్లో భూములు ఉన్నాయి. కేసీ కెనాల్, చాపాడు చానెల్, పెన్నా, కుందూ నది ప్రధాన జలవనరులు. ప్రధానంగా ఖరీఫ్ సీజన్‌లో వరిపైరు సాగు చేస్తారు. పసుపు, వేరుశనగ, తక్కువ సాగు చేస్తారు. వరిపైరు సుమారు 26 వేల ఎకరాల్లో సాగు చేస్తారు. వరిగడ్డి పుష్కలంగా లభిస్తుండడంతో గ్రామాలు పాడిపరిశ్రమకు నిలయంగా ఉన్నాయి. కేసీ కెనాల్‌కు జూలై నెలలో శ్రీశైలం రిజర్వాయర్ నుంచి సాగునీరు రాగానే రైతులు నారుకయ్యలు వేస్తారు. 20 రోజుల తర్వాత వరినాట్లు వేసే పనిలో బిజీగా ఉంటారు. వరిపైరు సాగులో పచ్చిరొట్ట ఎరువుగా జనుము, జీలుగలు ఉపయోగిస్తారు.దీనివల్ల మంచి దిగుబడి, తెగుళ్లు రాకుండా ఉంటాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం జీలుగ, జనుము, విత్తనాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం

పోరుమామిళ్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఈ సారి ముందుగానే రుతుపవనాలు పలకరించడం, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో రైతన్నలు సాగుకు సన్నద్ధమవుతున్నారు ముఖ్యంగా పోరుమామిళ్ల మండలంలో వరినే ప్రధాన పంటగా రైతన్నలు ఎన్నుకుంటారు. గత ఖరీఫ్‌లో దాదాపు 2వేల ఎకరాలకు పైగానే వరి సాగు చేశారు. పోరుమామిళ్ల చెరువు ఆయకట్టు పరిధిలో దమ్మనపల్లె, మార్కాపురం, కవలకుంట్ల, క్రిష్ణంపల్లె, గానుగపెంట, చల్లగిరిగెల, టేకూరుపేట తదిత ర ప్రాంతాల్లో వరిని ఎక్కువగా సాగు చేస్తారు. మరికొందరు సజ్జ, జొన్న, మొక్కజొన్న పంటల ను సాగు చేయనుండగా మరికొందరు పత్తి క్రాసింగ్ పంటలపై ఎక్కువ ఆసక్తి కనబరుస్తా రు. దాదాపు 800 నుంచి వెయ్యి లోపు ఉద్యా న పంటలపైన ఆసక్తి కనబరుస్తారు. గత ఏడాది ఖరీఫ్‌లో 5800 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. ముఖ్యంగా పోరు మామిళ్ల, రంగసముద్రం మరికొన్ని ప్రాంతాల్లో చెరువునీటిపై ఆధారపడతారు. దమ్మనపల్లె తదితర ప్రాం తాల్లో దుక్కులు దున్ని పొలాలను పైర్లు వేసేందు కు సిద్ధం చేసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల వరి నార్లు వేసుకునేందుకు రైతులు పొలా లను దుక్కులు దున్ని నార్లు పోసుకునేందుకు తయారు చేసుకుంటున్నారు. ఈ సారి విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నాయని వ్యవసాయాధికారి డాక్టర్ సాంబ, వరహరికుమార్ తెలిపారు. రైతులు కూడా యాజమాన్య పద్ధతులు పాటించి వ్యవసాయాధికారుల సలహాలు తీసుకుని పంటలు సాగు చేసుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చంటున్నారు.

ఖరీఫ్ విత్తనాల కోసం ఎదురుచూపు

దువ్వూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):ముందస్తుగా వానలు పలుకరించడంతో రైతులు పొలాలు సాగుకు సిద్ధం చేసుకుని ఖరీఫ్ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. దువ్వూరు మండలంలో కేసీ కాలువ కింద వరి పంట ఎక్కువగా వేస్తారు. ఇతర పంటలుగా పసుపు, వేరుశనగ, మినుము, మొక్కజొన్న, జొన్న, కందులు, పెసలు సాగు చేయడం జరుగుతోంది. డివిజన్‌లోని మైదుకూరు, చాపాడు, ఖాజీపేట, దువ్వూరు, రాజుపాళెం మండలాల పరిధిలో వ్యవసాయ శాఖ అధికారులు విత్తన అవసరాన్ని గుర్తించి ప్రతిపాదనలు తయారు చేసే పనిలో ఉన్నారు.

నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తత అవసరం

వ్యవసాయ శాఖ నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన పురుగు మందులు విక్రయించకుండా జాగ్రత్తపడాల్సిన అవసరం ఉందని రైతు నాయకులు కోరుతున్నారు. వ్యవసాయ అధికారులు నకిలీ విత్తన వ్యాపారులపై కొరడా ఝులిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు కోరుతున్నారు.

ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ


చుండీ శ్రీసహస్ర · మునిసాయి యాదవ్ · ప్రణయ్ సాయిముఖేష్ · కరణం పూర్వక్

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీ సెట్ పరీక్షా ఫలితాల్లో ప్రొద్దుటూరు విద్యార్థులు ప్రతిభ కనపరిచి ఉత్తమ ర్యాంకులు సాధించారు. కొత్తపల్లె పంచాయతీకి చెందిన నరసింహారెడ్డి, శైలజల కుమార్తె చుండీ శ్రీసహస్ర 58వ ర్యాంకు సాధించింది. జేఈఈ అడ్వాన్స్‌లో ఓపెన్ విభాగంలో 1102 ర్యాంకు సాధించింది. ఐఐటీలో చేరి కంప్యూటర్ సైన్స్ చదవాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. కొత్తపల్లె పంచాయతీకి చెందిన మునెయ్యయాదవ్, శివలక్ష్మిల కుమారుడు కె.మునిసాయియాదవ్ 60వ ర్యాంకు సాధించారు. ఇటీవల వెలువడిన జేఈఈ అడ్వాన్స్ ఓపెన్ కేటగిరిలో 1058 ఓబీసీ విభాగంలో 173వ ర్యాంకు సాధించారు. ఐఐటీలో చేరి కంప్యూటర్ సైన్స్ లేదా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ లేదా డేటా అనాలసిస్ కోర్సు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడు. పొట్టిపాడు రోడ్డుకు చెందిన సత్యనారాయణ, ఇందిర దంపతుల కుమారుడు పందిళ్లపల్లె ప్రణయ్‌సాయిముఖేష్ 70వ ర్యాంకు సాధించాడు. ఆ విద్యార్థి జేఈఈ మెయిన్స్‌లో 81వ ర్యాంకు, అడ్వాన్స్‌లో ఓపెన్ కేటగిరిలో 115వ ర్యాంకు, ఓబీసీ విభాగంలో 14వ ర్యాంకు సాధించాడు. తెలంగాణా ఎంసెట్‌లో 31వ ర్యాంకు సాధించాడు. భవిష్యత్తులో ఐఏఎస్ కావాలన్నది తన లక్ష్యమని పేర్కొన్నారు. హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన కరణం రమేష్, ఎస్.శ్రీవల్లి దంపతుల కుమారుడు కరణం పూర్వక్ 84వ ర్యాంకు సాధించాడు. జేఈఈ అడ్వాన్స్‌లో ఓపెన్ కేటగిరిలో 332 ర్యాంకు సాధించాడు. ఐఐటీలో చేరి కంప్యూటర్ సైన్స్ లేదా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డేటా అనాలసిస్ కోర్సు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడు.

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోండి


విద్యార్థులకు ప్రతిభా అవార్డులను అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తొగటవీర క్షత్రియ ఉద్యోగులు, వృత్తి నిపుణుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ కుండా నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం వసంతపేటలోని సంఘం కార్యాలయంలో 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనపరిచిన తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం సంఘం ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలను అందజేస్తున్నామన్నారు. 44 మంది బాలబాలికలకు నగదు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి రూ.5 వేలు, రెండవ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలను బాలబాలికలకు వేరువేరుగా అందజేశారు. అలాగే కన్సోలేషన్ బహుమతులు రూ.1500, దరఖాస్తు చేసుకున్నవారికి వెయ్యి రూపాయలు నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టుపోగుల పుల్లయ్య, డాక్టర్ ఉలసాల సుధాకర్, తొగటవీర క్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు బండారు సూర్యనారాయణ, అసిస్టెంట్ డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్ రఘునాథ్, ఆయన సతీమణి ప్రభావతి, రాధాకృష్ణమూర్తి, నందగోపాల్ పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలి


జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్రను కలిసిన మాదాసు మురళి


ప్రొద్దుటూరు టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలని ఆ పార్టీ నాయకులు మాదాసు మురళి పేర్కొన్నారు. ఆదివారం కోడూరులో జనసేన పార్టీమహిళా సర్పంచ్ కారుమంచి సంయుక్త నివాసంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్రను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పార్టీలో కష్టపడిన వారికి ప్రాధాన్యత కల్పిస్తామని పేర్కొన్నారని తెలిపారు. కార్యకర్తలు పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, రాముడు, సర్పంచ్ సంయుక్త, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసమే ఆర్యవైశ్య పఠనాలయం


ఆర్యవైశ్య పఠనాలయం ప్రారంభోత్సవం అనంతరం మాట్లాడుతున్న సంఘం నేతలు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసమే ఆర్యవైశ్య పఠనాలయం ఏర్పాటు చేసినట్లు సంఘం నేతలు పేర్కొన్నారు. స్థానిక రాజబాట వీధిలో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య పఠనాలయాన్ని ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ దుండి రాకేశ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు పఠనాలయం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన దుండి రాకేశ్‌ను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు, పఠనాలయం అధ్యక్షుడు గాజులపల్లె సుధీర్‌బాబు, కార్యదర్శి మేడా మధుసూదన్, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రథమ బహుమతి సాధించిన ప్రొద్దుటూరు ఎడ్లు


బండలాగుడు పోటీల్లో ప్రథమ బహుమతి గెలుపొందిన ఎడ్లు

అట్లూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అట్లూరు మండలంలోని కామసముద్రం అంకాలమ్మ జాతరలో భాగంగా ఆదివారం నిర్వహించి ఎద్దుల పోటీల్లో ప్రొద్దుటూరుకు చెందిన ద్వారశిల గుర్విరెడ్డి ఎడ్లు ప్రథమ బహుమతి లక్ష నూటా పదహారు రూపాయలు గెలుచుకున్నాయి. అలాగే రెండో బహుమతి రంగసానిపల్లెకు చెందిన మాచర వెంకటసుబ్బారెడ్డి ఎడ్లు రూ.80,116, మూడో బహుమతి అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన కె.రామాంజనేయులు ఎడ్లు రూ..60116, నాలుగో బహుమతి ఖాజీపేటకు చెందిన కవ్వా బాలయ్య ఎడ్లు రూ.40116, ఐదో బహుమతి రూ.20116లు ద్వారశిల గుర్విరెడ్డి ఎడ్లు గెలుచుకున్నాయి. గెలుపొందిన ఎడ్లదారులకు ఆలయ కమిటీ బహుమతులు అందించారు. అనంతరం సుడిబండి కార్యక్రమం గుడి చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. కోలాటాలు, భజన కార్యక్రమాలు చూసేందుకు మండల ప్రజలు భారీగా తరలివచ్చారు.

బుచ్చంపల్లెలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ


అమ్మవారికి పూజలు చేస్తున్న ప్రజలు

పోరుమామిళ్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బుచ్చంపల్లె గ్రామం లో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఆదివారం ఈ కార్యక్రమాలలో గ్రామస్థులు, స్థానిక నేతలు పాల్గొని పూజలు చేశారు. నల్లేరు విశ్వనాధరెడ్డి, చెరుకూరి పీరయ్య, కందుల వెంకటసుబ్బయ్య, రమణ య్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

జమ్మలమడుగు ఆస్పత్రికి చికిత్స చేయండి

● తీరుమారని ప్రభుత్వ వైద్యులు ● వైద్య చికిత్స కోసం పడిగాపులుగాస్తున్న రోగులు ● పట్టించుకోని అధికారులు


ఆస్పత్రిలో వైద్యుల కోసం పడిగాపులు కాస్తున్న రోగులు


డాక్టర్లు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

జమ్మలమడుగు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి కాయకల్ప చికిత్స చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఎన్నిసార్లు వైద్యుల కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు గంటల తరబడి వేచిచూస్తున్న వారిలో మార్పు కనిపించడంలేదు. దీంతో రోగుల ఇక్కట్లు వర్ణణాతీతంగా మారాయి. ఇందుకు నిదర్శనంగా ఆదివారం ఉదయం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి వివిధ గ్రామాల నుంచి రోగులు వైద్య చికిత్సల కోసం వచ్చారు. అయితే ఉదయం 9 గంటల నుంచి డాక్టర్లు విధులకు హాజరుకావాల్సి ఉండగా 10.45 గంటల వరకు డాక్టర్లు ఎవరు లేక వచ్చిన రోగులు పడిగాపులు కాశారు. ఈ సమస్య విషయమై ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌పాషాను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఆదివారం కావడం వలన డాక్టర్లు రాలేదని తెలిపారు. వెంటనే ఆయన చాంబర్ వద్ద నుంచి వచ్చి రోగులకు స్వయంగా వైద్యం అందించడం ప్రారంభించారు. కాగా జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రోగులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రిలో స్కానింగ్ సమస్య ఉందని, ఆ గదికి తాళం వేశారని ఆస్పత్రిలోని సమస్యలన్నింటిని పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

చాపాడు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భద్రిపల్లె గ్రామానికి చెందిన ఏనుగు సావిత్రి (40) అనే మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 3న సావిత్రి ఇంటిలోనే పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో ఉండగా కర్నూలు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

అనాథలకు అన్న వితరణ

కాశినాయన జూన్8(ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం సమీపంలోని నగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమంలోని అనాథలకు ఆదివారం పిట్టిగుంట గ్రామానికి చెందిన బద్వేల్ తెలుగు యువత మాజీ అధ్యక్షుడు బోవిళ్ల నరసింహారెడ్డి అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. అతని తల్లి సుబ్బమ్మ వర్ధంతిని పురష్కరించుకొని పండ్లు, బ్రెడ్డు అల్పాహారం , అన్నదానం ఏర్పాటు చేశారు.

గొడవలో పలువురికి గాయాలు

జమ్మలమడుగు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మైలవరం మండలం వద్దిరాల గ్రామం వద్ద ఆదివారం జరిగిన గొడవలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఐజే నవీన్, నాగేశ్వరమ్మ, నాగలక్ష్మి, మార్తమ్మ, వద్దిరాల ప్రభావతి, పెద్దపుల్లయ్య, చిన్నపుల్లయ్య, సుబ్బమ్మ అనే వారు గొడవ పడ్డారు. క్షతగాత్రుతులు జమ్మలమడుగు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ గొడవకు సంబంధించి తలమంచిపట్నం ఎస్ఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చిన్నపిల్లల విషయంలో గొడవపడి, జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఇంకా తమ ఫిర్యాదు అందలేదని ఆయన తెలిపారు.

విద్య నేర్చుకో.. తలరాత మార్చుకో...

ప్రొద్దుటూరు అర్బన్ జూన్ 8(ఆంధ్రజ్యోతి): విద్య నేర్చుకో.. తలరాత మార్చుకో... అనే నినాదంతో ప్రొద్దుటూరులో ఆదివారం ఎంపీజే ఆధ్వర్యంలో విద్యా జాగృతి నిర్వహించారు. ముఖ్యంగా బడి ఈడు పిల్లల సర్వేచేసి వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి ఎంపీజే కృషి చేస్తుందన్నారు. ఎంపీజే మాజీ అధ్యక్షుడు ఎస్పీ ముక్తియర్, ఎంపీజే రాయలసీమ ఇన్‌చార్జ్ ఎండీ అయూబ్‌ఖాన్ సన్మానించారు. ఉపాధ్యక్షుడు నజీర్ అహ్మద్, సభ్యులు పాల్గొన్నారు.

గీతాంజలి హైస్కూలు నూతన భవనం ప్రారంభం


గీతాంజలి హైస్కూలు నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక బొల్లవరంలో నూతన భవనంలో ఏర్పాటు చేసిన గీతాంజలి హైస్కూలును ఆదివారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు మంచి విద్యను అందించి ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. పాఠశాల వ్యవస్థాపకుడు ఎస్.శివరామిరెడ్డి, ఛైర్మన్ శ్రేయారెడ్డిలు మాట్లాడుతూ గత 21 సంవత్సరాలుగా పట్టణంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడానికి సొంత భవనంలోకి పాఠశాలను మార్పు చేశామన్నారు. పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్య నుంచి 10వ తరగతి వరకు ఉత్తమ ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, దేవగుడి గోపాల్‌రెడ్డి, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ నాయకులు, పట్టణ ప్రముఖులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల ఎంఈవోలుగా వెంకటయ్య, కొండిశెట్టి


మండల విద్యాశాఖధికారులుగా బాధ్యతలు స్వీకరించిన వారిని సన్మానించిన ఉపాధ్యాయులు

పోరుమామిళ్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల మండల విద్యాశాఖాధికారి-1గా పి.వెంకటయ్య, మండల విద్యాశాఖాధికారి-2గా కొండిశెట్టి పూర్తి_బాధ్యతలు స్వీకరించారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు పాఠశాలవిద్య జోన్-4 కడప ఉత్తర్వుల మేరకు ఆదివారం వారు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యాయులు బాలరాజు, వారణాసి రవి, జయరాం తదితరులు వారిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బలోపతం చేయడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

రూ.70 లక్షలతో రోడ్డు పనులకు శ్రీకారం

జమ్మలమడుగు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో నాగులకట్టవీధికి రోడ్డు మంజూరైందని కూటమి నాయకుడు నవనీశ్వరరెడ్డి తెలిపారు. అందులో భాగంగా గత కొన్ని సంవత్సరాలుగా ఆ రోడ్డు అక్కడక్కడ దెబ్బతింది. గత రెండు నెలల క్రితం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు మంచినీటి సమస్య పరిష్కారం కోసం సంజాముల మోటు నుంచి నాగులకట్టవీధి వసతి గృహం వరకు పైపులైను వేశారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం రోడ్డు నిర్మాణం కొరకు పనులు ప్రారంభించారు. రూ.70 లక్షలతో సంజాముల మోటు నుంచి నాగులకట్ట శ్రీ చౌడేశ్వరీ దేవాలయం వరకు రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు. దారికి అడ్డంగా ఉన్న అడ్డంకులు, వ్యర్థాలను తొలగించారు.

27 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కొండాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 27 ఏళ్ల తర్వాత 1997-98 బ్యాచ్ కు చెందిన పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక జరిగింది. ఈ కార్యక్రమానికి అలనాటి విద్యార్థులు హాజరై తమ మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.అనాటి మధురస్మృతులు మరువలేనివని ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. 27 సంవత్సరాల తర్వాత ఒక చోట సమావేశమై అప్యాయంగా పలకరించుకుంటూ ఒకరినొకరు తమ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో , వివిధ హోదాల్లో ఉంటూ చాలా కాలం తర్వాత ఒకచోటికి చేరి తమ అభిప్రాయాలను పంచుకోవడం అనందంగా ఉందని వారు తెలిపారు. ఈ సందర్భంగా తమ ఉన్నతికి తోడ్పడిన అలనాటి గురువులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఓబులేసు,రామయ్య, టీచర్ జయరాజు, విశ్రాంత ఉపాధ్యాయులు చెంచిరెడ్డి, లక్ష్మిరెడ్డి, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి,రాజారెడ్డి,జోసఫ్, ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.